సాక్షి
జగిత్యాల
బుధవారం॰ 11॰ జనవరి॰ 2023



అంజన్నకు మొక్కులు

కొండగట్టు : వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, ప్రముఖులు మంగళవారం శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



కోటిలింగాల సందర్శన

వెల్గటూర్: టీటీడీ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ రామనాథం మంగళవారం కోటిలింగాల పునర్నిర్మాణాన్ని పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
31.0/12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా లక్ష పుష్పార్చన



పుష్పార్చన చేస్తున్న భక్తులు

కోరుట్లటౌన్: పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి లక్ష పుష్పార్చన ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి విక్రమ్, సహాయ అధికారి నర్సయ్య, ప్రధాన పూజారి బీర్నంది నరసింహాచారి, సహాయక పూజారి శ్రీనివాసాచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'రాళ్లవాగు' మరమ్మతులకు ప్రతిపాదనలు



కుడికాలువ గేట్ పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేట శివారులోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ మరమ్మతులకు రూ.8.25 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు నీటిపారుదల శాఖ డీఈ రవికుమార్ మంగళవారం తెలిపారు. ప్రాజెక్టు కుడికాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు అందడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు ఇటీవల వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు ప్రాజెక్టును పరిశీలించారు. కుడికాలువ గేట్‌ను ఇష్టమొచ్చినట్లు రైతులు వినియోగించడంతో చివరి ఆయకట్టుకు నీరందడంలేదని గుర్తించారు. ఇకనుంచి తూము గేట్‌ను ఇతరులు ముట్టుకోకుండా రెవెన్యూ సిబ్బందితో సెక్యూరిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బాల్కొండ డీఈ నాగేశ్, ఏఈ శేఖర్, కూన శ్రీనివాస్ ఉన్నారు.

'పేదలను విస్మరించారు'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సమస్యలను విస్మరించాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక వర్తక సంఘ భవనంలో మంగళవారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ భారతజాతిని ఏకం చేసేందుకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడోయాత్ర చేపట్టారని అన్నారు. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. నాయకులు రవీందర్‌రావు, మ్యాకల రమేశ్, మహిపాల్‌రెడ్డి, గుర్రం మహేందర్‌గౌడ్, మండ రమేశ్, దివాకర్, అల్లీపూర్, అత్తినేని గంగారెడ్డి, ఆదిరెడ్డి, తంగెళ్ల రమేశ్, రాజిరెడ్డి, మున్ను పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఆర్పీఎఫ్ బలగాలతో అధికారులు, నాయకులు

రాయికల్(జగిత్యాల): శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా ఆర్పీఎఫ్ బలగాలు సేవలు అందించి, ప్రజల్లో నమ్మకం కలిగిస్తాయని జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. మంగళవారం ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో ఆర్పీఎఫ్ బలగాలు సేవలు అందిస్తాయని డీఎస్పీ అన్నారు. అనంతరం శివాజీ విగ్రహం నుంచి పాతబస్టాండ్, గాంధీచౌక్ వరకు కవాతు నిర్వహించారు. 4వ వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, వైస్ చైర్మన్ రమాదేవి, సీఐ కృష్ణకుమార్, ఎస్సై కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు మహేందర్, సాయికుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వణికించే చలిలో..



వేకువ జామునే దినపత్రిక సరిచేస్తున్న పేపర్‌బాయ్స్



చలిమంటలు కాగుతూ..

రాయికల్(జగిత్యాల): మూడు, నాలుగురోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు బాగా పడిపోతున్నాయి. చలితీవ్రత పెరుగుతోంది. రోజువారీ పనులు చేసుకునే వారు ఇబ్బందులు పడుతూనే తమ పనులు కానిచ్చేస్తున్నారు. మంగళవారం వేకువ జామున 5గంటల నుంచి ఉదయం 8గంటల వరకు రాయికల్‌లో 'సాక్షి' కెమెరాకు చిక్కిన దృశ్యాలు ఇవీ..



ప్రయాణం కోసం మహిళా రైతుల నిరీక్షణ



రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది



వేకువ జామునే టీ తాగుతున్న వాకర్స్



వ్యాయామం చేస్తూ..

'టాస్క్'తో ఉద్యోగావకాశాలు

- జిల్లాలో 2,651 మంది విద్యార్థుల ఎంపిక
- మల్టీ నేషనల్ కంపెనీల్లో ఇప్పటికే 200మందికి ఉద్యోగాలు
- ఈనెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం



టాస్క్ శిక్షణ ఇస్తున్న అధికారి, హాజరైన విద్యార్థులు(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): ప్రస్తుత పోటీ ప్రపంచంలో చాలామంది విద్యార్థుల్లో ఆశించిన నైపుణ్యాలు కానరావడంలేదు. డిగ్రీ పట్టాలు చేతపట్టుకొని ఉపాధి అవకాశాల కోసం దిక్కులు చూస్తున్నారు. ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినవారు కూడా ఉద్యోగ పోటీ పరీక్షల్లో నైపుణ్యాలు ప్రదర్శించలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ నాలెడ్జ్(టాస్క్) విద్యార్థులకు అండగా నిలుస్తోంది. దీనికింద జిల్లావ్యాప్తంగా 2,651మంది విద్యార్థులు ఎంపికై శిక్షణ పొందుతున్నారు.

ఆంగ్లంపై పట్టు..

- టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా సానబెడుతున్నారు.
- సాఫ్ట్‌స్కిల్స్, అర్థమెటిక్ అండ్ రీజనింగ్, నెట్ వర్కింగ్, ట్యాలీ, మెడికల్ కోడింగ్, సీ, సీ ప్లస్ ప్లస్, హెచ్‌టీఎంఎల్, జావా ప్రోగ్రామింగ్స్, ఆటోక్యాడ్, త్రీడీ ప్రింటింగ్ తదితర అంశాల్లో నిపుణులు శిక్షణ ఇస్తున్నారు.
- పలు రకాల పరిశ్రమలను సందర్శించడంతోపాటు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు.
- ఆలోచనలకు సాంకేతికతను జోడించి అవకాశాలను ఎలా సృష్టించాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు.
- వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించే నైపుణ్యం, సాంకేతికతలో ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నారు.
- టాస్క్‌లో ఒరాకిల్, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ సంస్థలను భాగస్వాములను చేశారు.
- పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

కాలేజీ విద్యార్థులు లక్ష్యం..

జిల్లాలో 20 మండలాలు, 5మున్సిపాలిటీలు ఉన్నాయి. ఒక ఇంజినీరింగ్, ఒక పాలిటెక్నిక్, 4 ప్రభుత్వ, 7 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, ఒక టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ.. ఇలా 14 డిగ్రీ స్థాయి కళాశాలలు ఉన్నాయి. టాస్క్‌లో ఈ విద్యాసంవత్సరం 1,700 మంది విద్యార్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. టాస్క్‌లో మొత్తం 2,651 మంది యాక్టివ్ విద్యార్థులు ఉన్నారు. గతేడాది ఇందులో చేరిన వారిలో సుమారు 200 మంది పలు మల్టీనేషన్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. టాస్క్‌లో చేరుందుకు ఎస్సీ, ఎస్టీలు రూ.300, బీసీ, ఓసీలు రూ.590 వన్‌టైం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. లెక్చరర్లు, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే టాస్క్‌లో చేరేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని విద్యావేత్తలు అంటున్నారు.

ఈనెల 31 వరకు గడువు..

- 2022–23 విద్యాసంవత్సరానికి విద్యార్థుల పేర్లు, కళాశాలల వివరాలు నమోదు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీచేశారు.
- ఇందులో చేరేందుకు గతనెలలోనే గడువు ముగిసింది.
- అయినా, టాస్క్‌లో చేరిన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని భావించిన ఉన్నతాధికారులు.. గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నైపుణ్య సాధనపై దృష్టి సారించాలి. ఉన్నత విద్యతోపాటు నైపుణ్య శిక్షణను ఉపయోగించుకుంటే యువత త్వరగా ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రతీ గ్రాడ్యుయేట్.. టాస్క్‌లో చేరేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. లెక్చరర్లు సహకరించాలి. విద్యార్థులు సైతం ఆధునికత వైపు అడుగులు వేస్తూ లక్ష్యం చేరాలి.

– గంగాప్రసాద్, టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఉమ్మడి కరీంనగర్

ఉద్యోగం వచ్చింది



కోరుట్లలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్ పూర్తి చేసిన. టాస్క్‌లో చేరి శిక్షణను సద్వినియోగం చేసుకున్న. 2022లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. టాస్క్‌లో చేరడంతోనే తక్కువ సమయంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. పాఠ్యాంశాలే కాదు సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి. అప్పుడే మంచి అవకాశాలు వస్తాయి.

– చిత్రాల శ్రీజ, ఇన్ఫోసిస్ ఉద్యోగి, కోరుట్ల

మార్కులు గీటురాయి కాదు



గతేడాది బీఎస్సీలో స్టాటికల్ కంప్యూటర్ కోర్సు పూర్తిచేసిన. సంవత్సరంలోనే టాస్క్‌లో చేరిన. శిక్షణకాలాన్ని సద్వినియోగం చేసుకున్న. ఫైనల్ ఇయర్‌లో ఉండగానే ఇన్ఫోసిస్‌లో మంచి ప్యాకేజీలో ఉద్యోగం వచ్చింది. ఈ పోటీ ప్రపంచంలో పాఠ్యాంశాల ఆధారంగా వచ్చే మార్కులు ప్రతిభకు గీటురాయి కాదు. అన్నిఅంశాల్లో సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి.

– రుద్ర సంతోషిణి, ఇన్ఫోసిస్ ఉద్యోగి, కోరుట్ల

పకడ్బందీగా కంటివెలుగు

- మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: జిల్లాలో ఈనెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతామని, ఇందుకోసం అధికారులు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. 18ఏళ్ల వయసు దాటిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం మండలానికో ప్రత్యేకాధికారిని నియమించామని తెలిపారు. మొత్తం 46 వైద్య బృందాలు వైద్యపరీక్షలు చేస్తాయని అన్నారు. ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. ఇందుకోసం డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆశ కార్యకర్తలను నియమిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, అంధత్వ నివారణలో ఇది అత్యంత ముఖ్యమైన కార్యక్రమమన్నారు. కలెక్టర్ రవి, అడిషనల్ కలెక్టర్లు మకరంద్, లత, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాల రూపొందించిన నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ, ఈనెల 5 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు అండగా ఉంటాం

పేదలకు అండగా ఉంటామని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఇటీవల దరఖాస్తు చేసుకున్న టీఆర్‌నగర్‌కు చెందిన 58 మంది పేదలకు మంగళవారం ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరికీ అండగా ఉంటామన్నారు.

మోడల్ స్కూల్ పిలుస్తోంది

- ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు
- ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష
- మే 15న ఫలితాల వెల్లడి



మల్లాపూర్‌లోని మోడల్ స్కూల్

మల్లాపూర్(కోరుట్ల): పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో చదువు చెప్పడానికి రాష్ట్రప్రభుత్వం ఆదర్శ పాఠశాలలు ప్రారంభించింది. ఆరు నుంచి పదో తరగతి, ఇంటర్మీడియేట్ వరకు అనుభవం గల ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తోంది. ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. దీంతో మోడల్ స్కూళ్లలో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

13 స్కూళ్లు.. 9,330మంది విద్యార్థులు..

- జిల్లాలో మొత్తం 13 మోడల్ స్కూళ్లలో 4,260 మంది బాలురు, 5,070 మంది బాలికలు.. మొత్తంగా 9,330 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.
- ఏటా ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో 100 సీట్లు భర్తీచేస్తున్నారు.
- ఇందుకోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు.
- ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేస్తున్నారు.
- ఇంటర్మీడియేట్ కోసం పదో తరగతిలో వచ్చిన గ్రేడ్ పాయింట్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నారు.
- ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం ఈనెల 9న ప్రవేశాల షెడ్యూల్ విడుదల కాగ, ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు.

ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష, మే 15న ఫలితాలు..

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితో పాటు 7 – పదో వరకు తరగతి వరకు ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఏప్రిల్ 8 నుంచి ఆరో తరగతితోపాటు 7 నుంచి పదో తరగతుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆరో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7 నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మే 15న పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నారు. మే చివరివారంలో సర్టిఫికెట్లను పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తారు.

జిల్లా సమాచారం

మోడల్ స్కూళ్లు	13
మొత్తం విద్యార్థులు	9,330
బాలురు	4,260
బాలికలు	5,070

విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తాం. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ఆదర్శ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండడంతో నాణ్యమైన విద్య అందుతోంది. విద్యార్థులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

పోర్టు పోలియో జడ్జిల నియామకం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాలకు పోర్టుపోలియో జడ్జిలను హైకోర్టు మంగళవారం నియమించింది. కరీంనగర్‌కు జస్టిస్ కన్నెగంటి లలిత, పెద్దపల్లి జిల్లాకు జస్టిస్ ఎన్‌వి శ్రవణ్‌కుమార్, జగిత్యాల జిల్లాకు జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి, సిరిసిల్ల జిల్లాకు జస్టిస్ డి.నాగార్జునను నియమించారు.

బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రబారీ, కన్వీనర్ల నియామకం

కరీంనగర్ టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రబారీలు, కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ప్రభాస్ యోజన కన్వీనర్ జి.ప్రేమేందర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం ప్రబారీగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రబారీగా అట్లపురం విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్‌గా బోయినపల్లి ప్రవీణ్‌రావు, జాయింట్ కన్వీనర్లుగా ఎం.దశరథరెడ్డి, ఆడేపు రవీందర్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్‌గా పుదిల మల్లికార్జున్, జాయింట్ కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్‌గౌడ్‌ను నియమించారు.

ఇ - శ్రమ్ కార్డులు పొందాలి

జగిత్యాల: అసంఘటిత రంగ కార్మికులు ఇ - శ్రమ్ కార్డులు పొందాలని కార్మిక శాఖ అధికారి రాజేశ్వరమ్మ మంగళవారం సూచించారు. అర్హులైన కార్మికులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో మొబైల్ నంబరు ద్వారా పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మెట్‌పల్లి, జగిత్యాల త్వరలో అవగాహన కల్పిస్తామన్నారు.

పండుగకు పస్తులేనా?

- బియ్యం ఉన్నా పంపిణీలేదు
- సాంకేతిక లోపంతో సమస్య
- రేషన్ బియ్యం కోసం పేదల నిరీక్షణ



రాయికల్‌లోని రేషన్ దుకాణం

రాయికల్(జగిత్యాల): సంక్రాంతి పండుగకు రేషన్ బియ్యం అందక పేదలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పేదల కోసం ప్రనెలా 1వ తేదీ నుంచి 15వ తేదీవరకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. కరోనా నేపథ్యంలో అర్హులందరికీ ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నాయి. ఈ ఏడాది పొడవునా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కేంద్రప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే, రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వలు ఉన్నా.. సాంకేతిక లోపంతో పంపిణీకి నోచుకోవడంలేదు.

20 మండలాలు..587 రేషన్ షాపులు..

- జిల్లాలో 20 మండలాలు ఉండగా ఐదు మున్సిపాలిటీ ఉన్నాయి.
- మొత్తం 587 రేషన్ దుకాణాల పరిధిలో 3,03,860 రేషన్‌కార్డులు ఉన్నాయి.
- కార్డుపై ఒక్కొక్కరికి 10కిలోల చొప్పున ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందించాల్సి ఉంది.
- ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు బియ్యాన్ని పంపిణీ చేస్తారు.
- కానీ, ఈ పాస్ మిషన్ ఆన్ కాకపోవడం, ఆన్‌లైన్ సర్వర్ సమస్యతో రేషన్ బియ్యం పంపిణీ ఇంకా ప్రారంభం కాలేదు.
- ఈనెల 15న సంక్రాంతి పండుగ ఉంది. ఈసందర్భంగా పేదలు పిండివంటలు తయారు చేసుకోవడం ఆనవాయితీ. కానీ, పదో తేదీ గడించినా రేషన్ బియ్యం పంపిణీ చేయడంలేదు.
- పౌరసరఫరాల శాఖ మంత్రి స్పందించి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని పేదలు కోరుతున్నారు.

సాంకేతిక సమస్య ఉంది

జిల్లాలోని రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వలు ఉన్నాయి. సాంకేతిక లోపంతో పంపిణీ ప్రారంభం కాలేదు. సమస్య పరి ష్కారం కాగానే అందరికీ బియ్యం పంపిణీ చేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సి న అవసరంలేదు.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

విద్యార్థులకు క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

జగిత్యాలక్రైం: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న జాతీయ యూత్ డే (స్వామీ వివేకానంద జయంతి) సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించామని ఎస్పీ సింధూ శర్మ మంగళవారం తెలిపారు. విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్,షాట్‌పుట్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామన్నారు. క్రీడాపోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వంపెరుగుతుందని అన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

• పలువురికి గాయాలు


ప్రమాద స్థలంలో వాహనాలు

మేడిపెల్లి(వేములవాడ): ఆటోను ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలో మంగళవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఈప్ప లింగారెడ్డి, కథలాపూర్ మండలం సిరికొండకు చెందిన రమేశ్ కలిసి పనినిమిత్తం కారులో జగిత్యాల నుంచి కోరుట్లకు బయలు దేరారు. మేడిపెల్లి శివారులోని ఎల్లమ్మ టెంపుల్ వరకు వెళ్లగా ఆటోను ఓవర్‌టేక్ చేయబోయారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీ, కారు, ఆటో ఒకదానితో మరోటి ఢీకొన్నాయి. ప్రమాదంలో కారు నడుపుతున్న ఈప్ప లింగారెడ్డి(41)కి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కారులో ప్రయాణిస్తున్న రమేశ్‌తోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు, లారీలో ప్రయాణిసున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళ మృతికి కారణమైన వ్యక్తికి జైలు

జగిత్యాలక్రైం: తిమ్మాపూర్ గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని అజాగ్రత్తగా వాహనం నడిపి ఓ మహిళ మృతికి కారణమైన పిట్టల చంద్రయ్యకు ఆరునెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంగళవారం కోర్టు తీర్పు ఇచ్చింది. సారంగాపూర్ మండలం నాగునూర్ గ్రామానికి చెందిన నక్క గంగారెడ్డి అతడి భార్య అనిత 2010 జనవరి 31న తమ ద్విచక్ర వాహనంపై జగిత్యాలకు వస్తున్నారు. మార్గమధ్యంలో చిన్నగట్టు వద్ద ఎదురుగావస్తున్న మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహన డ్రైవర్ పిట్టల చంద్రయ్య అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి గంగారెడ్డి వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో గంగారెడ్డి, అతడి భార్య అనిత, మరో మహిళ పిట్టల లచ్చమ్మకు తీవ్రగాయాలయ్యాయి. పిట్టల లచ్చవ్వ కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఏపీపీ రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ హరిప్రసాద్ మంగళవారం కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టారు. జగిత్యాల మొదటి అదనపు జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ జితేందర్.. పిట్టల చంద్రయ్యకు ఆరునెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాజేశ్(ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన కాటిపల్లి రాకేశ్(41) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందా డు. కాటిపల్లి రాకేశ్‌కు కొద్ది సంవత్సరాలుగా తీ వ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్నతోపాటు కుమారులు వసుంధర్, రోహిత్ ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ రద్దు కోసం..


మున్సిపల్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన


తహసీల్ చౌరస్తాలో అన్నదాతల రాస్తారోకో

• అన్నదాతల పోరుబాట
• పెల్లుబికుతున్న నిరసనలు
• జిల్లా కేంద్రంలో ఆందోళనలు

జగిత్యాల/జగిత్యాలరూరల్: మున్సిపాలిటీలో చేపట్టబోయే కొత్త మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయడం లక్ష్యంగా అన్నదాతలు పోరుబాట కొనసాగిస్తున్నారు. మంగళవారం కూడా వారు జిల్లా కేంద్రంలో ఆందోళనలు ఉధృతం చేశారు. ఏటా మూడు పంటలు పండే భూములను ఇండస్ట్రియల్ జోన్ కింద గుర్తించడంతో తమ బతులు ఏం కావాలని ప్రశ్నిస్తున్నారు.

విలీనంతోనే తిప్పలా..

లింగంపేట, టీఆర్‌నగర్, మోతె, తిప్పన్నపేట, హస్నాబాద్, అంబారిపేట గ్రామాల్లోని కొన్ని సర్వేనంబర్లను జగిత్యాల మున్సిపాలిటీలో విలీనం చేశారు. అప్పటికే సిద్ధం చేసుకున్న మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసి విలీన గ్రామాలను కలుపుకుని కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. పట్టణ శివారును ఇండస్ట్రియల్, ఎడ్యుకేషన్, రిక్రియేషన్ జోన్‌లుగా విభజించారు. దీంతో రైతుల తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

పోరుబాట..

కొత్త మాస్టర్‌ప్లాన్ ద్వారా విలువైన భూములు కోల్పోతున్నామని, దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని రైతులు మంగళవారం ముట్టడించారు. ఇందిరాగాంధీ చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పంట భూములను పారిశ్రామిక కారిడార్‌లో చేర్చవద్దని కోరారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. కామారెడ్డిలోనూ ఇలానే మాస్టర్‌ప్లాన్ రూపించారని, రైతులకు వ్యతిరేకంగా ఉన్న దీనిని నిరసిస్తూ ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడని అన్నదాతలు ఆవేదన చెందారు. ఇక్కడి కొత్త మాస్టర్‌ప్లాన్ రద్దు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. గ్రామసభల తీర్మానాలకు అనుగుణంగా కలెక్టర్ జోక్యం చేసుకుని స్పష్టత ఇస్తేనే తమ ఆందోళనలు విరమిస్తామని వారు అన్నారు.

తహసీల్‌చౌరస్తాలో రాస్తారోకో..

జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో నర్సింగాపూర్, తిమ్మాపూర్, లింగంపేట, తిప్పన్నపేట గ్రామాల రైతులు రాస్తారోకో చేశారు. సుమారు గంటన్నరపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. పచ్చని భూములను ఇండస్ట్రియల్, రిక్రియేషన్ భూముల పేరిట జోన్లుగా ఏర్పాటు చేసి తమను నిండా ముంచాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్, తిమ్మాపూర్, లింగంపేట సర్పంచులు, ఎంపీటీసీలు, బాధితులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పష్టత ఇవ్వాలి

కొత్త మాస్టర్ ప్లాన్‌పై కలెక్టర్ స్పష్టత ఇవ్వాలి. రైతుల భూముల్లో మూడు పంటలు పండుతాయి. వీటిని ఇండస్ట్రియల్ జోన్‌గా ప్రకటించడం అన్యాయం. గ్రామసభల తీర్మానం మేరకు మాస్టర్‌ప్లాన్ రూపొందించాలి.

– పన్నాల తిరుపతిరెడ్డి, రైతు నాయకుడు

ప్రజాభీష్టం మేరకే మాస్టర్‌ప్లాన్

ప్రజాభీష్టం మేరకే కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించాం. రైతులు ఆందోళన చెందవద్దు. 1989లో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ఇప్పటికీ అమలులో ఉంది. చట్టబద్ధ అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇది ముసాయిదా మాస్టర్‌ప్లాన్ మాత్రమే. ఇంకా అమలులోకి రాలేదు. ప్రతిపక్షం మాటలు నమ్మవద్దు. బాధిత రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటాం.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల

అధికారుల తీరుతోనే పనుల్లో ఆలస్యం


రోళ్లవాగు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

• 20లోగా రోళ్లవాగు ఆయకట్టుకు సాగునీరు
• జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్(జగిత్యాల): రోళ్లవాగు ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం కావడానికి అధికారులు కారణమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ శివారుల్లోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలతో రోళ్లవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోయిందన్నారు. ప్రాజెక్టు ఆయకట్టులో ఇసు మేటలు, మట్టిదిబ్బలు పెట్టి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. అయినా, ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి లేకుండాపోయిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రూ.130 కోట్లు వెచ్చించి మరమ్మతులు చేపట్టామన్నారు. పనులు ప్రస్తుతం 90శాతం పూర్తయ్యాయని అన్నారు. ఈనెల 20వ తేదీలోగా రోళ్లవాగు ఆయకట్టుకు సాగునీరు అందించడానికి అందించడానికి అధికారులు పనులను వేగంగా కొనసాగిస్తున్నారని చెప్పారు. అనంతరం బీర్‌పూర్, సారంగాపూర్ మండలాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, మసర్తి రమేశ్, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుర్రాల రాజేందర్ రెడ్డి, నల్ల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం చేయండి

• కాంగ్రెస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి పాలిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఇంటింటా వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త భాగస్వామి కావాలన్నారు. బీఆర్‌ఎస్ రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ అజీమ్, కాయితి నాగరాజు, తొట్ల అంజయ్య, పులి హరిప్రసాద్, కట్ట శంకర్, లోక నర్సారెడ్డి, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, లింగంగౌడ్, కోట శంకర్, సత్యనారాయణ, కల్లెడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మందుబాబుల వీరంగం

• బావుసాయిపేట సబ్‌స్టేషన్‌లో మద్యం సిట్టింగ్‌లు

కోనరావుపేట(వేములవాడ): ప్రజలకు విద్యుత్ సేవలు అందించాల్సిన సబ్‌స్టేషన్ మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం మత్తులో ఓ గ్రామస్తున్ని పిలిచి చితకబాదారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. కోనరావుపేట మండలం బావుసాయిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొంత కాలంగా మద్యం సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఆపరేటర్‌గా పనిచేస్తున్న నందకుమార్ డ్యూటీలో ఉన్న రోజులు మందుబాబులతో నిండిపోతుంది. ప్రతి రోజూ గ్రామస్తులు చేరుకుని సబ్‌స్టేషన్‌లోనే మద్యం సేవించడం పరిపాటిగా మారింది. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం సబ్‌స్టేషన్ ఆవరణలో ఆపరేటర్ నందకుమార్‌తో కలిసి మద్యం సేవిస్తున్న కొందరు గ్రామస్తులు ఇదే గ్రామానికి చెందిన లాల సంజీవ్‌ను మందుపార్టీకని పిలిచి చితకబాదారు. గ్రామానికి చెందిన వెంకటేశంతోపాటు మరికొందరు తనపై దాడికి పాల్పడినట్లు బాధితుడు సంజీవ్ కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా గత కొన్నిరోజులుగా సబ్‌స్టేషన్‌లో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, ఆపరేటర్ మద్యం మత్తులో రైతులతో దురుసుగా మాట్లాడుతున్నాడని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌పీడీసీఎల్ ఏడీ ప్రదీప్‌ను వివరణ కోరగా సబ్‌స్టేషన్‌లో జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఇల్లంతకుంట(మానకొండూరు): ఇల్లంతకుంటలోని బస్టాండ్ వద్ద అతివేగంగా వచ్చి కారు ఢీకొనడంతో మండల కేంద్రానికి చెందిన అంతగిరి పర్శరాములు(55) మృతిచెందాడు. పర్శరాములు బస్టాండ్ వద్ద మంగళవారం నిలబడగా ముస్కాన్‌పేటకు చెందిన ఒరుగంటి సురేశ్ కారులో అతివేతంగా వచ్చి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ పర్శరాములను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య విజ య, కుమారుడు హరికృష్ణ, కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై మోతి రామ్ పరిశీలించి మృతుడి భార్య విజయ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు పర్శరాం(ఫైల్)

అప్పులబాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ తొండ్ల రవికుమార్(24) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవికుమార్ కొంతకాలంగా ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేశాడు. ఇటీవల పాత ఇంటికి మరమ్మతులు, రెండు గదుల నిర్మాణానికి రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరిగిపోతుండడంతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున వరి నాటుకు కూలీలను తీసుకొస్తానని చెప్పి వెళ్లి పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుని తండ్రి ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

సమగ్ర ఆరోగ్య సంరక్షణపై అవగాహన

• డీఎంహెచ్‌వో శ్రీధర్


మాట్లాడుతున్న పుప్పాల శ్రీధర్

జగిత్యాల: సమగ్ర ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏఎన్ఎంలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యశాఖ శిక్షణ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏడు బ్యాచ్‌ల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆడపిల్లలు, మగ పిల్లల నిష్పత్తి సమానంగా ఉండాలని, జిల్లాలో వెయ్యి మందికి 962 మంది ఆడపిల్లలు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి శోభారాణి, ఆరోగ్య సంరక్షకులు దీక్షితరాణి, పార్వతి, శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి ఆకుల శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి


మాట్లాడుతున్న మధురిమ

జగిత్యాల: రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మధురిమ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, పనిభారం తగ్గించాలని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఈనెల 12న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. నాయకులు గూడూరు జయప్రద, శైలజ, విజయలక్ష్మి, జువ్వాజి మేరి, సుప్రియ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో జైలుశిక్ష

కరీంనగర్‌క్రైం: బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లిన ఆకుల విక్రమ్(31)కు ఏడేళ్ల జైలు, రూ.300 జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి భవానీచంద్ర మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హుజూరాబాద్ పట్టణశివారు కొత్తపల్లికి చెందిన బాలిక(16) హుజూరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మెకానిక్ పనిచేసే ఆకుల విక్రం బాలికకు మాయమాటలు చెప్పి 2016 జనవరి 25న తీసుకెళ్లాడు. బాలికకోసం రెండురోజులు వెతికిన ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విక్రమ్ కూడా రెండు రోజులుగా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి గాలింపు చేపట్టారు. ఖమ్మం జిల్లాలోని ఓ గ్రామంలో ఇద్దరిని పట్టుకున్నారు. బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. హుజూరాబాద్ పోలీసులు విక్రమ్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రమణమూర్తి దర్యాప్తు జరిపారు. సాక్షులను ఏపీపీ కే.సంజీవరెడ్డి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడైన విక్రమ్‌కు ఏడేళ్ల జైలు, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఇల్లందకుంట: టీకుర్తిలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోడేటి సంజీవ్– బోగం స్వరూపకు మధ్య ఇంటి దారికి సంబంధించిన గొడవ జరుగుతోంది. మంగళవారం సంజీవ్ తన ఇంటి ఎదుట ప్రహరీ నిర్మించేందుకు పునాది తీశాడు. ఈ విషయం గురించి స్వరూప, ఆమె కుటుంబ సభ్యులు కలిసి సంజీవ్‌ను నిలదీశారు. ఈ క్రమంలో సంజీవ్, అనిల్, రఘున, అగ్గి శ్రీకాంత్, తోడేటిమధుసూదన్, తోడేటి ఓదెలు కలిసి స్వరూపను కులంపేరుతో దూషించారు. ఆమెపై దాడిచేసి గాయపరిచారు. స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

రిక్రియేషన్ జోన్ నుంచి తొలగించండి

జగిత్యాల: కొత్త మాస్టర్‌ప్లాన్ ప్రకారం రిక్రియేషన్ జోన్‌లోకి మార్చిన తమ వ్యవసాయ భూములను ఆ జోన్ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్ గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాస్టర్ ప్లాన్‌ను వ్యతిరేకిస్తూ తిమ్మాపూర్ గ్రామసభలో తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ రైతులకు అండగా ఉంటానని, రెండు పంటలు పండే భూమిని రిక్రియేషన్ జోన్‌లో చేర్చడం సరికాదన్నారు. సర్పంచ్ మెరుగు రమ్య, ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతి లాభదాయకం

• కొత్తిమీరలో అధిక దిగుబడికి అవకాశం
• కొత్తిమీర సాగుచేస్తున్న అభ్యుదయ రైతు


కట్టలు కట్టిన కొత్తిమీరతో రైతు గోపాల్‌రెడ్డి

జగిత్యాలఅగ్రికల్చర్: ఏటా వానాకాలం, యాసంగిలో రైతులు ఒకేతీరు పంట పండిస్తుండడంతో నేల సారం కోల్పోతోంది. దిగుబడులు రావడం ఏమోకానీ.. పెట్టుబడులు రాక నష్టాల పాలవుతున్నారు. చాలామంది రైతులు వరి తర్వాత అదే పంట పండిస్తున్నారు. ఇంకొందరు మొక్కజొన్న ఆ నేలలో అదే పంట పండిస్తున్నారు. తద్వారా పురుగులు, తెగుళ్లు ఆశించి పంటలు దెబ్బతిని రైతులకు అప్పులే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు గడ్డం గోపాల్‌రెడ్డి ప్రధాన పంట తర్వాత మరో తేలికైన పంట పండిస్తూ మంచి ఆదాయం పొందుతున్నాడు. ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

మొక్కజొన్న తర్వాత కొత్తిమీర సాగు..

• సాధారణంగా రైతులు వానాకాలంలో మొక్కజొన్న సాగు చేసిన తర్వాత యాసంగిలోనూ మొక్కజొన్న పండిస్తున్నారు.
• తద్వారా కత్తెరపురుగు, కోతుల బెడదతో పంటలు ధ్వంసం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు.
• గోపాల్‌రెడ్డి మాత్రం ఇతర రైతులకు భిన్నంగా.. ఆకు కూరలు సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు.
• ఇందుకోసం, రెండురోజుల పాటు జగిత్యాల మార్కెట్‌ను పరిశీలించాడు.
• వినియోగదారులకు నిత్యం అవసరమైన కొత్తిమీర ఆకుకట్టలు మినీ ట్రక్కుల్లో నిజామాబాద్ జిల్లా అంకాపూర్ నుంచి జగిత్యాల మార్కెట్‌కు వస్తుందని పసిగట్టాడు.
• మార్కెట్లోని కొందరు వ్యాపారులను కొత్తిమీర ధర గురించి అడిగి తెలుసుకున్నాడు.
• మొక్కజొన్న పంట పూర్తికాగానే 30 గుంటల్లో కొత్తిమీర సాగు చేయాలని నిర్ణయించాడు.
• ఈ మేరకు నేలను రెండు, మూడుసార్లు ట్రాక్టర్‌తో బాగా దున్నించాడు.
• చివరి దుక్కిలో డీఏపీ వంటి అడుగుమందు వేసి, మట్టి పెళ్లలు లేకుండా రొటోవేటర్ వేయించాడు.
• రూ.4వేలు పెట్టి, 30 కిలోల విత్తనాలను జగిత్యాలలో కొనుగోలు చేశాడు.
• వాటిని తన చేతితోనే తోటంతా చల్లాడు.
• వెంటనే విత్తనాలు మొలకెత్తేలా డ్రిప్ ద్వారా నీరును అందించాడు.
• ఇలా.. వారానికి ఓసారి మొక్కల పరిస్థితిని బట్టి నీరు అందించాడు.
• కలుపు మొక్కలు రాకుండా విత్తనాలు విత్తిన తొలిదశలోనే గడ్డిమందు చల్లాడు.

30-35 రోజుల్లోనే దిగుబడి..

కొత్తిమీర పూతకు వస్తే మార్కెట్లో అమ్ముడు పోదు. విత్తనాలు వేసిన 30 రోజుల్లోనే పంట చేతికి వస్తుంది. పంట కోతను 30–35 రోజుల్లోనే పూర్తిచేయాల్సి ఉంటుంది. పంటకు కావాల్సిన అన్ని యాజమాన్య పద్ధతులు పాటించడంతో 30 గుంటలకు కనీసం 20–25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించాడు. ఈ మేరకు గోపాల్‌రెడ్డి మార్కెట్‌కు వెళ్లి వ్యాపారులతో రేటు మాట్లాడుకున్నాడు. రెండు, మూడు రోజుల్లోనే రోజుకు నలుగురైదుగురు కూలీలను పెట్టి, కొత్తిమీరను నేలనుంచి తీసి, సుతిలితో కట్టలు కట్టి, ట్రాక్టర్‌లో జగిత్యాల మార్కెట్‌కు తరలించాడు. కట్టలను ఉదయం 3 గంటల వరకే వ్యాపారులకు అందించాల్సి ఉంటుందని, ఆకులు వాడిపోకుండా చాలా ఇబ్బందులు పడతామని చెప్పారు. వ్యాపారులు కిలో రూ.40–రూ.50 వరకు అమ్ముకుంటే, హోల్‌సేల్‌గా కిలోకు రూ రూ.20 చొప్పున విక్రయించాడు. మొక్కజొన్న పంట తీసిన తర్వాత రెండు నెలల్లోనే రెండుసార్లు కొత్తిమీర తీశాడు. మొదటిసారి కొత్తిమీర సాగులో చేసిన తప్పులు మళ్లీ చేయకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ, రెండోసారి మంచి దిగుబడులు తీశాడు. ఇప్పుడు, అదే నేలలో కొత్తిమీర తర్వాత టమాట సాగు చేసేందుకు నేలను బాగా ఎండబెట్టి, చదును చేసే ప్రయత్నం చేస్తున్నాడు. మా భార్యభర్తల కష్టార్జితం పోను, పంట వేసినప్పుడల్లా రూ.10 వేల వరకు ఖర్చు వస్తే, రూ. 40 వేల వరకు ఆదాయం లభిస్తోందని గోపాల్‌రెడ్డి చెప్పాడు. నెలపాటు పంట పండించిన రైతుకు కిలోకు రూ.20 వస్తే, ఒకేరోజులో రైతు పండించిన పంటను అమ్మిన వ్యాపారికి కిలో రూ.50 వరకు వస్తోంది. అయితే, కష్టపడితే ఎంతో కొంత వస్తుందని కొత్తిమీర సాగుతో తెలిసిందని గోపాల్‌రెడ్డి వివరించాడు. రైతుగా వేరే వ్యాపకాలు లేక, ఈ పనులు చేయాల్సి వస్తుందని చెప్పడం కొసమెరుపు.